క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, టేకి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామికి అర్చక బృందం సభ్యులు పంచామృతాభిషేకం చేశారు. అంగర గ్రామంతోపాటు పడమర ఖండ్రిక, తాతపూడి, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భ భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ, దాతలు అన్నదానం చేశారు.

'చంటిబాబు'కు పలువురి పరామర్శ

రాయవరం: పితృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని మాచవరం వైఎస్సార్ సీపీ నేత నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి (చంటిబాబు)ని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం పరామర్శించారు. ఈ నెల 4న చంటిబాబు తండ్రి గంగిరెడ్డి మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. మాచవరం మాజీ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కాశీఈశ్వరరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ద్వారంపూడి చినరెడ్డి, గొలుగూరి సుబ్బారెడ్డి, మల్లిడి భామి రెడ్డి, పులుగుర్త చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు పేరిశెట్టి లాలయ్య, టీడీపీ నేతలు రొంగల శ్రీను, మేడపాటి శ్రీనివాసరెడ్డి, సత్తి రామారెడ్డి, వైట్ల సుబ్బారావు, వైట్ల రాంబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

శెట్టిబలిజ సంఘం ఆర్థిక సాయం



గౌరమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

రామచంద్రపురం: గత 30 ఏళ్లుగా పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో సేవ చేస్తున్న గుబ్బల గౌరమ్మ(70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను శెట్టిబలిజ సంఘ నాయకులు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, వాసంశెట్టి లక్ష్మీనారాయణ, దంగేటి వెంకట్రావు, కడలి రామకృష్ణలు శనివారం పరామర్శించారు. ఆమె భర్త సత్యనారాయణ, కుమార్తెలు యల్లబోయిన మంగ, గెద్దాడ పద్మావతి, కుమారుడు గుబ్బల నాగేశ్వరరావులను ఓదార్చారు. వారికి రూ.10 వేలు సంఘం తరఫున ఆర్థికసాయం అందజేశారు.

అందుబాటులో 100 క్వింటాళ్ల విత్తనాలు

రాయవరం: రైతులకు అందుబాటులో 100 క్వింటాళ్ల విత్తనాలు ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి ఎం.ప్రభాకర్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎంటీయూ 7029 రకం 40 క్వింటాళ్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 50 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే రైతుభరోసా కేంద్రాల్లో ఎంటీయూ 1318 రకం విత్తనాలు 10 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. విత్తనాలు కొనుగోలు చేసుకున్న రైతులు మొలక శాతాన్ని పరీక్షించుకున్న తర్వాతే విత్తనాలు చల్లుకోవాలన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్ బారిన పడిన బాధితుడికి శనివారం స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యుడు రూ. 11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పొడగట్లపల్లి గ్రామానికి చెందిన ఎ.శేఖర్ బాబు కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రూ.11 వేల నగదును పొడగట్లపల్లి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు.

జనతా ఇన్సూరెన్స్ స్కీంలో చెక్కుల పంపిణీ

సఖినేటిపల్లి: అంతర్వేది పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు మేడిది జగపతి రావు, పోతురాజు భగవన్నారాయణల కుటుంబ సభ్యులకు జనతా ఇన్సూరెన్స్ స్కీంలో మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. రైతులు ఇరువురూ కూడా ఒక రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఒక్కో రైతు కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా పై స్కీంలో మంజూరైనవి. వీటిని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సంఘ అధ్యక్షుడు దూది త్రినాథ్, సభ్యులు జెల్లా శ్రీనివాస్, నల్లి మరియమ్మ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘ సీఈవో పినపోతు ప్రభాకర్, బెల్లంకొండ ఏసుబాబు, బెల్లంకొండ రామకృష్ణ పాల్గొన్నారు.

కర్బనం నిండుగా.. సాగు పండగ

- లోపిస్తే వ్యాధులకు ఆస్కారం
- పెరుగుదల, దిగుబడులపై ప్రభావం



ఎస్.సత్యప్రసాద్, ఏవో, రామచంద్రపురం



పచ్చిరొట్ట పైరును పొలంలో కలియదున్నుతున్న ట్రాక్టర్

రామచంద్రపురం రూరల్: నేలలో కర్బన పదార్థం పుష్కలంగా ఉంటే పంటల సాగు ఖుషీగా సాగుతుందని పరిశోధనల్లో వెల్లడైన సత్యం. అందుకే భూసార పరీక్షల్లో వెల్లడైన అంశాల ఆధారంగా భూమిలో సేంద్రియ కర్బన లోపం లేకుండా చూసుకోవాల్సి ఉంటుందని రామచంద్రపురం మండల ఏవో ఎస్.సత్యప్రసాద్ అన్నారు. సాగు భూముల్లో సేంద్రియ కర్బన లోపం పంటల దిగుబడులు పడిపోయేందుకు ప్రధాన కారణంగా మారుతోంది. సేంద్రియ కర్బనం సాగు నేలకు ముఖ్యమైంది. ఇది పంటల పెరుగుదలపై అన్ని దశల్లో ప్రభావం చూపుతుంది. దీని లోపం వల్ల పంటల దిగుబడులు సగానికి దిగజారుతున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. ఈ కర్బనాన్ని నేలలో మరింత తగ్గుముఖం పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే రైతు ఆశించిన స్థాయిలో అధిక దిగుబడులు పొందవచ్చు. సాగు నేల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటేనే నేలలో సేంద్రియ కర్బనాన్ని రైతు కాపాడుకోవచ్చు.

కర్బన లోపంతో దుష్పరిణామాలు ఇవి

సేంద్రియ కర్బనం లోపించిన నేలలు నిస్సారంగా తయారవుతాయి. పైర్ల ఎదుగుదల బాగా కుంటుపడుతుంది. ఆకుల్లో పత్రహరితం లోపిస్తుంది. వరి పైరుకు వచ్చేసరికి వెన్ను పొడవుగా తయారు కాకుండా అడ్డుకుంటుంది. వెన్నులో వడ్ల గింజల సంఖ్య తగ్గుతుంది. తాలు,తప్పలు ఎక్కువగా వస్తాయి. ఆకులు పొట్టిగా సన్నగా అవుతాయి. వరి మొక్క పెరుగుదల కురచగా మారిపోయి పిలకలు తగ్గుతాయి. దీంతో దిగుబడులు గణనీయంగా పడిపోతాయి. భూసార పరీక్షల్లో సేంద్రియ కర్బన లోపం నత్రజని స్థాయిని తెలియజేస్తుంది. కర్బనం తక్కువగా ఉన్న నేలల్లో 75 కేజీల నత్రజని ఎరువులను ఎక్కువగా వాడవచ్చు. నేలలో కర్బనం ఎక్కువగా ఉంటే నత్రజనిని 60 కేజీల వరకు మూడు మోతాదుల్లో తక్కువగా వేయాలి.

పాడి పరిశ్రమతో కర్బన లోపాన్ని నివారించవచ్చు

సాగు భూముల్లో సేంద్రియ కర్బన లోపం ఎక్కువగా ఉంటోంది. వంద శాతం మట్టిలో ఉండాల్సిన కర్బనం 30 శాతానికి పడిపోయిందంటే రైతే దీర్ఘకాలికంగా చేసుకుంటున్న పొరపాటేనని చెప్పాలి. ఈ పరిమాణంతో రైతు చేతికి 40 బస్తాలు అందాల్సిన పంట 20 బస్తాలకు పడిపోతోంది. గతంలో పాడి, పంట వేర్వేరుగా ఉండేవి కాదు. పాడి, పంట కలిస్తేనే వ్యవసాయంగా రైతులు భావించేవారు. కానీ అది ప్రస్తుత కాలంలో కొరవడింది. ఆ కారణంగానే నేలలో ఈ విపరీత సమస్య వచ్చింది. పశువుల నుంచి వచ్చే పెంట పోగును పుష్కలంగా పొలంలో చల్లితే ఈ సమస్య నివృత్తి అవుతుంది. దీనివల్ల సేంద్రియ కర్బన శాతం నేలలో పెరిగి, సమస్య అంచెలంచెలుగా తగ్గిపోతుంది. వానపాముల ఎరువును వాడితే మరింతగా ఈ లోపాన్ని సరిచేయవచ్చు.

సమగ్ర పోషకాల యాజమాన్యంతోనే సాధ్యం

సేంద్రియ కర్బనాన్ని సాగు నేలల్లో పెంపొందించేందుకు సమగ్ర పోషకాల యాజమాన్యంతో సాధ్యమవుతుంది. సేంద్రియ ఎరువు అందుబాటులో లేనప్పుడు వీలును బట్టి జీలుగ, జనుము, అలసంద, పిల్లి పెసర మొదలైన పైర్లను పెంచాలి. ఈ పచ్చిరొట్ట పైర్లు పెరిగాక సాగుకు ముందు దమ్ముల్లో కలియదున్నాలి. అప్పుడు పచ్చిరొట్ట ఎరువులోని పోషకాలు నేలలోకి ఇమిడి, పంట పెరుగుదలకు దోహదపడుతుంది. సేంద్రియ ఎరువులు వాడినప్పుడు రసాయన ఎరువుల ద్వారా వేసే నత్రజని మోతాదును 20–25 శాతం వరకు తగ్గించాలి. అజొల్లా వాడితే తక్కువ ఖర్చుతో ఎకరానికి10–12 కేజీల నత్రజనిని పైరుకు అందిస్తుంది. సుస్థిర అధికోత్పత్తికి లోపస్థాయిలో ఉన్న అన్ని పోషకాలను పైరుకు సరఫరా చేసే ఎరువులు వేయాలి. భూసార పరీక్షల్లో నిర్ధారించిన నేలల్లోని పోషక లోపాలను బట్టే ఎరువుల వాడకం ఉండాలి.

కవ్వింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించం

కె.గంగవరం: మండలంలో ఎన్నికల అనంతరం కొంత మంది రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని సామాన్య ప్రజలకు శాంతి భద్రతల విషయంలో విఘాతం కలిగిస్తే తాట తీస్తామని కె.గంగవరం ఎస్సై జానీ బాషా అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కె.గంగవరం, కూళ్ల, పామర్రు, మసకపల్లి తదితర గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కె.గంగవరం సెంటర్లో ఆయన మాట్లాడుతూ ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటే తప్పకుండా కేసులు నమోదు చేస్తామన్నారు. కేసులు రిజిస్టర్ అవ్వడం వల్ల యువకుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉంటుందని కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సమయమనం పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసుల వద్ద ఫోర్స్ లేదని చాలా మంది కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని దానిలో భాగంగానే కేంద్ర బలగాలతో మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. హద్దు మీరితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చట్టానికి ఎవరూ అతీతులు కాదని చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

కిక్ బాక్సింగ్‌లో నిహారిక ప్రతిభ



నిహారికను సత్కరిస్తున్న బీకే రత్నం తదితరులు

రామచంద్రపురం: పట్టణానికి చెందిన కారుమూరి నిహారిక అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీహారికకు ప్రోత్సాహకాలు అందిస్తే మరింతగా రాణించగలదని కిక్ బాక్సింగ్ అంతర్జాతీయ రిఫరీ, కోచ్ బీకే రత్నం అన్నారు. అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌కి ఎంపికైన నీహారికను పట్టణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ విన్నర్‌గా నిలిచిన కారుమూరి నీహారికను నేషనల్ కిక్ బాక్సింగ్ చీఫ్ బీకే రత్నం, నేషనల్ కిక్ బాక్సింగ్ రిఫరీ, కోచ్ అంజనీకుమార్‌లు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా బీకే రత్నం మాట్లాడుతూ ఇటీవల మహారాష్ట్ర పూణేలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో నీహారిక ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ మెడల్ సాధించి విన్నర్‌గా నిలిచిందన్నారు. నేషనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచే విధంగా కోచింగ్ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇస్తే ఎంతోమంది విద్యార్థులు నేషనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, దేశానికి గర్వకారంగా నిలిచే విధంగా తర్ఫీదు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. తమిళనాడులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తుందని, అదే విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు.

లార్వా అరికడితేనే మలేరియా నిర్మూలన సాధ్యం

అయినవిల్లి: చెత్తకుప్పలు, చెత్తకుండీలు, మురుగు నీటి కాలువల్లో దోమ లార్వా వృద్ధి చెందుతుందని ఆ ప్రదేశాల్లో ఉన్న దోమ లార్వాను వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేసి అరికడితేనే మలేరియాను పూర్తిగా నివారించవచ్చని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు లక్ష్మీసౌజన్య, పి.విజయ్ అన్నారు. శనివారం వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని బొమ్మరాళ్లతిప్పలో మలేరియా మాసోత్సవం పురస్కరించుకుని మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. మలేరియా వ్యాధి ప్రబలకుండా ముందుస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గ్రామంలో వైద్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ లార్వా అధికంగా ఉండే ప్రదేశాలను తనిఖీ చేసి వాటిలో వృద్ధి చెందిన దోమ లార్వాలు ప్రజలకు చూపించి వాటిని నాశనం చేయడంపై అవగాహన కల్పించారు.

సహకార సంఘాల అధ్యక్షుల రాజీనామా



ఆర్యావటం పీఏసీఎస్‌లో సిబ్బందికి రాజీనామా పత్రం అందజేస్తున్న ఛైర్మన్ కురుపూడి సూర్యనారాయణ

కాజులూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన పీఏసీఎస్(సహకార సంఘాలు) అధ్యక్షులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ మేరకు శనివారం ఆర్యావటం పీఏసీఎస్‌లో అధ్యక్షుడు కురుపూడి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్యావటం, తణుకువాడ, దుగ్గుదుర్రు, గొల్లపాలెం, కోలంక సహకారసంఘాల అధ్యక్షులు కురుపూడి సూర్యనారాయణమూర్తి, పితాని సుబ్రహ్మణ్యం, రేమళ్ళ చిట్టియ్యదొర, డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి, తొగరు చంద్రశేఖర్‌బాబు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ స్థానికంగా రైతుల సమస్యలపై తమకు గల అవగాహన, వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తాము చేస్తున్న కృషిని గుర్తించి నాయకులు తమకు సహకార సంఘాల అధ్యక్ష పదవులకు ఎంపిక చేశారన్నారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, భారీ వర్షాలకు పంటలు నష్టపోతే సకాలంలో నష్టపరిహారాలు అందజేత, సబ్సిడీపై యంత్రాలు, పనిముట్ల పంపిణీ వంటి అనేక రైతు సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములమయ్యామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాబివృద్ధికి జగనన్న ప్రభుత్వం ఎంతో కృషి చేసినా ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నామని, పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహించి రెండు రోజుల క్రితమే తమ రాజీనామాలను సీఈఓలకు ఇచ్చామన్నారు. రైతు సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారికి అండగా ఉంటామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కోతకు గురవుతున్న ఏటిగట్టు
- తాత్కాలిక చర్యతోనే సరి
- శాశ్వత చర్యలకు తీసుకోవాలంటున్న ప్రజలు



గతేడాది వరద కారణంగా ముందస్తు చర్యగా సుందరపల్లి ఏటిగట్టు వద్దకు ఇసుక బస్తాలు దింపుతున్న దృశ్యం (ఫైల్)

కె.గంగవరం: గౌతమీ గోదావరి కుడి ఏటిగట్టు మండలంలోని పలుచోట్ల బలహీనంగా మారింది. వర్షాకాలం వచ్చిందంటేనే గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు ఉండడం లేదు. గోదావరికి వరద వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హుటాహుటిన ఇసుకమూటలు, కర్రలతో తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారని గోదావరి తీర ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని సుందరపల్లి వద్ద ఏటిగట్టు మరింత బలహీనంగా ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కూళ్ల నుంచి మసకపల్లి వరకు సుమారు 21 కిలోమీటర్ల మేర ఏటిగట్టు ఉంది. అయితే సుందరపల్లి, దంగేరు, భట్లపాలిక, మసకపల్లి వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉంది. దీనిలో సుందరపల్లి వద్ద రోడ్డు సగానికి కోతకు గురైంది. గత ఏడాది వచ్చిన వరదల్లో అధికారులు ఇక్కడ ఇసుక బస్తాలు వేసి పటిష్టం చేశారు. అయితే అదే ఏడాది రెండోసారి వచ్చిన వరదకు అవి కూడా గోదావరిలో కొట్టుకుపోయాయి. తరువాత కొంత కాలంగా ఏటిగట్టు రోజు రోజుకూ కోతకు గురవుతుంది. ప్రస్తుతం ఏటి గట్టు సగానికి కోతకు గురైంది. కోతకు గురవుతున్న ప్రాంతంలో కొద్దిపాటి కంకర మాత్రమే అధికారులు ఏర్పాటు చేశారు. కానీ పూర్తి స్థాయిలో ఏటిగట్టు పటిష్టతకు చర్యలు తీసుకోలేదు. ఈ వర్షాకాంలో వరద ఉధృతి కాస్త పెరిగితే ఏటిగట్టు మరింత కోతకు గురవుతుందని స్థానికులు అంటున్నారు. ఏటా నిర్వహించే తాత్కాలిక చర్యలు మానేసి పూర్తి స్థాయిలో శాశ్వత చర్యలు చేపట్టే విధంగా అధికారులు స్పందించి వెంటనే ఏటిగట్టు పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దివంగత నేత రాజశేఖరరెడ్డితోనే మహర్దశ

దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో ఏటిగట్టుకు మహర్దశ వచ్చింది. అప్పట్లో నిధులు మంజూరు చేసి జొన్నాడ నుంచి యానం వరకు ఏటిగట్టును వెడల్పు, ఎత్తు పెంచారు. గతంలో వరదలు వచ్చినప్పుడు అల్లాడిపోయే ప్రజలకు గట్టు ఎత్తు పెంచడంతో కొంత ఉపశమనం పొందారు. అయితే గట్టు ఎత్తు పెంచినా కొన్ని చోట్ల గోదావరి వరద నీరు కోతకు గురి అవడంతో బలహీనంగా మారింది.

ప్రతిపాదనలు పంపించాం

బలహీనంగా ఉన్న సుందరపల్లి ఏటిగట్టును పటిష్టం చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల రాగానే గట్టును పటిష్టం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. గోదావరికి వరద వచ్చినా గట్టుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– సుబ్బారావు, పీడబ్ల్యూడీ ఏఈ, కె.గంగవరం

కొంగల 'పంట' పండింది



కర్షకులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. పలుచోట్ల ఉత్సాహంగా దమ్ములు కూడా చేస్తున్నారు. ఈ సమయంలో భూమిలో నుంచి బయటకు వచ్చే పురుగులు, కీటకాలను తినేందుకు కొంగలు క్యూ కడుతున్నాయి. తెల్లటి వందలాది కొంగలు పొలాల్లో వాలిపోతున్నాయి. ట్రాక్టర్ల సాయంతో రైతులు దమ్ము చేయిస్తుంటే, కొంగలు మాత్రం తమ ఆహారాన్వేణలో నిమగ్నమయ్యాయి. రైతు చేతికి పంట రావడానికి ఇంకా చాలా సమయం ఉంది. ప్రస్తుతానికి మాత్రం కొంగల పంట పండుతోంది. వాటి కడుపు నిండుతోంది.

– రాయవరం

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు



భక్తులతో కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్త పారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతా మూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజలు చేశారు.

ఆంజనేయస్వామికి లక్షసిందూర పూజ



అయినవిల్లి: మండలంలోని నేదునూరు హైస్కూల్ వద్ద వేంచేసిన ఆంజనేయస్వామికి శనివారం లక్ష సిందూర పూజ నిర్వహించారు. వేదపండితుడు పెదపూడి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో 11 మంది రుత్వికులు ఈ పూజలు జరిపారు. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, కుంభ పూజ, అగ్నిమధనం, హోమం, తర్పణం వంటి విశేష పూజలతో పాటు లక్షసిందూర, లక్ష తమలపాకులతో పూజలు జరిపారు. స్వామికి ఇష్టమైన అప్పాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తురాయి పూల సోయగాలు



ప్రకృతి తొలకరించే వేళ .. తురాయి చెట్లు నిండుగా విరబూసి చూపరులను కనువిందు చేస్తున్నాయి. కొమ్మలన్నీ పూలరెమ్మలై నయన మనోహరంగా ఆకట్టుకుంటున్నాయి. కాకినాడ–మండపేట ప్రధాన రహదారి వెంబడి ఉన్న తురాయి చెట్ల పూలు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. కుంకుమ రంగులోని పూల సోయగాలు ప్రకృతి ప్రేమికులను పరవశింప జేస్తున్నాయి.

– రాయవరం

బడికి వేళాయె..



అలమూరులోని మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

అలమూరు/కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభానికి సిద్ధమయ్యాయి. గత ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా తీసుకున్న నిర్ణయాలతో జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరుకున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వాటిని సీఆర్‌పీలు, పార్ట్‌టైం ఉపాధ్యాయుల ద్వారా పాఠశాలలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలు తెర చిన వెంటనే విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలతో 2024–25 విద్యా సంవత్సరం ఘనంగా ప్రారంభమవుతుంది ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 12న పునః ప్రారంభం కావలసి ఉండగా కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం దృష్ట్యా ఒక రోజు ఆలస్యంగా ఈనెల 13న ప్రారంభం కానున్నాయి. ఇక విద్యార్థుల ఆటవిడుపుకు స్వస్తి పలికి చదువుకునేందుకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్య నోట్ పుస్తకాలు, షూలు వంద శాతం సరఫరా జరిగింది. అలాగే ఒకటి నుంచి ఏడు తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలు 50 శాతం అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో మిగిలిన విద్యా కానుకలు, పాఠ్య పుస్తకాలు, ఏకరూపు దుస్తులు మండలాలకు చేరుకోనున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజు నుంచి ఒకటి, ఆరు తరగతులు చదివే విద్యార్థులను రికార్డు స్థాయిలో చేర్చుకునేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసింది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 584 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో జెడ్పీ హైస్కూల్స్ 84, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు 452, ప్రాథమికోన్నత పాఠశాలలు 48 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

నాడు–నేడు పథకంలో పాఠశాలలు అభివృద్ధి

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఇప్పటికే తొలి విడత నాడు–నేడు పనులు పూర్తి కాగా రెండో విడత పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు. ఇందుకు రూ.135 కోట్లు ఖర్చు చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. 724 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు 724 మందికి ఎంపిక కాగా ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయి. కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులు ప్రవేశ రుసుం కింద గ్రామీణ ప్రాంత విద్యార్థులు రూ.ఆరు వేలు చొప్పున ఆయా పాఠశాలలకు చెల్లించాల్సి ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.